సాక్షి
చిత్తూరు
ఆదివారం । 20 । ఏప్రిల్ । 2025



ఇండోర్ స్టేడియం కూల్చివేతపై విచారణ
పుంగనూరులో ప్రజల సహకారంతో నిర్మించిన ఇండోర్ స్టేడియం కూల్చివేతపై డీఆర్ఓ శనివారం విచారణ చేపట్టారు. - 4లో



శుభ్రతలో భాగస్వాములు కావాలి
పల్లెల పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం అవసరమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పేర్కొన్నారు. - 4లో



మోసగాళ్లు అరెస్టు
లక్ష్మీపూజ మోసం కేసులో పరారీలో ఉన్న అయిదుగురు నిందితులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. - 4లో

న్యూస్‌రీల్

నేలరాలిన మామిడి



తోటల్లో నేలరాలిన మామిడి

సదుం : మండలంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షంతో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. తీవ్ర గాలులకు కంభంవారిపల్లె పంచాయతీ పరిధిలోని కురవపల్లె, చెనకవారిపల్లె తదితర ప్రాంతాలలోని పలు మామిడి తోటల్లో కాయలు నేల రాలడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈ సారి పంట దిగుబడి అంతంత మాత్రంగానే ఉండగా.. ప్రస్తుత అకాల వర్షంతో ఉన్న కొద్దిపాటి మామిడి కాయలు నేలరాలడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ద్రవిడ వర్సిటీలో 'ఇంజినీరింగ్'!



నివేదికను వర్సిటీ అధికారులకు సమర్పిస్తున్న కమిటీ సభ్యులు

కుప్పం: కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ విద్యను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ద్రావిడ వర్సిటీ ప్రాంగణంలో పద్మావతి మహిళా వర్సిటీ ఆచార్య పి.వెంకటక్రిష్ణ, వేలూరు విట్ విశ్వవిద్యాలయం ఆచార్య ఎం.రాజశేఖర్‌లతో కూడిన ద్విసభ్య కమిటీ వర్సిటీలోని మౌలిక వసతులు, భవనాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి సైన్స్, కంప్యూటర్ సైన్స్ విత్ మిషన్ లెర్నింగ్ రెండు ఇంజినీరింగ్ విభాగాలను ప్రారంభించేందుకు నివేదికలు తయారు చేసి వర్సిటీ అధికారులకు సమర్పించారు. కార్యక్రమంలో వర్సిటీ డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య కె.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

రేపు సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టు పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : కుప్పం ఏరియా ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టు పోస్టుల భర్తీకి సోమవారం వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ పద్మాంజలి తెలిపారు. అనస్తీషియా , జనరల్ మెడిసిన్, రేడియోలాజీ, ఈఎన్‌టీలకు సంబంధించి పోస్టుల భర్తీ ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు సోమవారం చిత్తూరు నగరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.





రుచికి, పోషకాలకు మామిడి పెట్టింది పేరు. అందుకే ఇది పండ్లల్లో రారాజుగా గుర్తింపు తెచ్చుకుంది. కానీ ఏటా మామిడి వినియోగం తగ్గిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఎనర్జీ డ్రింక్స్, కూల్ డ్రింక్స్ మోజులో పడి యువత మామిడి రుచిని ఆస్వాదించలేకపడం ఒక విధంగా అవగాహనా రాహిత్యమేనని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. కళాశాలలు, పాఠశాలల స్థాయి నుంచే మామిడి వినియోగంపై అవగాహన పెంచాలని సూచిస్తున్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మధుర ఫలం.. పోషకాలు ఘనం!

సమాచారం

మామిడి సాగు	గుజ్జు పరిశ్రమలు
1.5 లక్షల ఎకరాలు	47
ఏటా దిగుబడి	రైతుల సంఖ్య
5,47,320 టన్నులు	80 వేల మంది



మామిడిని ట్రేలకు ఎత్తుతున్న వ్యాపారులు

- జిల్లాలో విస్తారంగా మామిడి సాగు
- యూరప్‌లో యుద్ధాల కారణంగా అమ్ముడుపోని గుజ్జు
- ఆపసోపాలు పడుతున్న అన్నదాతలు
- స్థానికంగానే వినియోగం పెంచాలంటున్న వైద్య నిపుణులు



మామిడిని గ్రేడింగ్ చేస్తున్న సిబ్బంది

కాణిపాకం: మామిడి సాగు సంక్షోభంలో చిక్కుకుపోయింది. మామిడి గుజ్జుకు డిమాండ్ పడిపోయింది. పరిశ్రమల్లో నిల్వలు పేరుకుపోయాయి. గత ఏడాది వివిధ ఫ్యాక్టరీలు 2.75 లక్షల టన్నుల మామిడి గుజ్జును తయారు చేసి నిల్వ చేశాయి. ఈ గుజ్జు అత్యధికంగా యూరప్ దేశాలకు ఎగుమతి చేయాల్సి ఉంది. కానీ అక్కడ యుద్ధాల కారణంగా గతేడాది నుంచి గుజ్జు ఎగుమతులు స్తంభించాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 40 శాతం మేర గుజ్జు ఎగుమతి చేసినట్టు అధికారులు చెబుతున్నారు. మామిడి గుజ్జు కిలో రూ.60 నుంచి రూ.65 వరకు అమ్ముడు పోవాల్సి ఉండగా ప్రస్తుతం రూ.36 పలుకుతోంది. దీంతో ఏంచేయాలో తెలియక రైతులు.. పరిశ్రమల నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు. ఈ క్రమంలో మామిడిలో అధిక పోషకాలు ఉన్నాయని, దీని వినియోగం పెరిగితే అటు రైతుకు.. ఇటు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

కూల్‌డ్రింక్స్‌తో ప్రమాదం

కూల్‌డ్రింక్స్ వినియోగం అమాంతం పెరిగిపోతోంది. చిన్న పాటి ఫంక్షన్ నుంచి పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల వరకు భారీ స్థాయిలో కూల్‌డ్రింక్స్ వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్న నేపథ్యంలో కూల్‌డ్రింక్స్ అమ్మకాలు జోరందుకున్నాయి. ఇదే అదునుగా పెద్దపెద్ద మాల్స్‌లో కూల్‌డ్రింక్స్‌ను ఆఫర్ల పేరుతో అమ్మేస్తున్నాయి. తక్కువ ధరకు వస్తుందని చాలా మంది కూల్‌డ్రింక్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇవి తాగడం వల్ల అజీర్ణం, వాంతులు, అధిక బరువు, డయాబెటిక్, ఫ్యాటీ లివర్, గుండె, కీళ్ల సమస్యలు, పంటి సమస్యలతో పాటు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మామిడితో ఉపయోగాలెన్నో

మామిడి పండ్లు, జ్యూస్‌లో పొటాషియం, మెగ్నీషియం అధికంగా ఉంటుంది. ఇవి రక్తపోటు సమస్యను నివారిస్తాయి. విటమిన్-సీ, ఫైబర్ శరీరంలోని హానిచేసే కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. పంటి నొప్పి, చిగుళ్ల సమస్యలను, చిగుళ్ల నుంచి రక్తం కారడం లాంటి సమస్యలను దూరం చేస్తాయి. నోటిలోని బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. దంతాలు శుభ్రపడుతాయి. పంటిపై ఎనామిల్ కూడా దృఢంగా ఉంటుంది. మామిడి మంచి జీర్ణకారి. సహజమైన బరువు పెంచేందుకు దోహదం చేస్తోంది. మామిడి రసంలో ఉండే విటమిన్లు, ఖనిజాలు గుండె జబ్బు రాకుండా కాపాడుతాయి. వృద్ధాప్య సమస్యలను తగ్గిస్తుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు దోహదం చేస్తుంది. మెదడును ఆరోగ్యంగా ఉంచుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది.

ఎనర్జీ డ్రింక్‌ల మోజులో పడొద్దు



యువత ఎక్కువగా ఎనర్జీ డ్రింక్‌ల మోజులో పడుతోంది. కిక్ అంటూ వెంటపడుతున్నారు. అయితే దాని వల్ల వచ్చే ప్రమాదాలను గుర్తించలేకపోతున్నారు. కాలేజీలు, పాఠశాలల్లో పండ్ల రసాల వినియోగంపై అవగాహన పెంచాలి. ఎనర్జీ డ్రింక్స్‌లు తాగితే వచ్చే అనర్థాలను వివరించాలి.

-గోవర్దన్‌బాబి,
మామిడి పండ్ల గుజ్జు పరిశ్రమలశాఖ జిల్లా అధ్యక్షుడు, చిత్తూరు

మామిడి ఆరోగ్యానికి మంచిది



మామిడి రసం, పండ్లల్లో విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉంటాయి. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచే బీట కెరాటిన్ అనేది సమృద్ధిగా ఉంటుంది. ఫైబర్ కావాల్సినంత ఉంటుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. ఎనర్జీ పెంచుతుంది. బరువు తక్కువగా ఉన్న పిల్లలు ఎక్కువగా తీసుకోవచ్చు. కంటి చూపునకు మేలు చేసే గుణాలు మ్యాంగోలో అధికం.

– సునీతాదేవి, చీఫ్ డైటీషియన్, స్విమ్స్, తిరుపతి

స్వచ్ఛ నిర్లక్ష్యం



శుభారాం డిగ్రీ కళాశాలలో కట్టెలతో చెత్త ఊడ్చుతున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు

పుంగనూరు:ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా ప్రతి మూడో శనివారం కార్యాలయాలు, విద్యా సంస్థలు , మున్సిపాలిటీలు , గ్రామాల్లో పరిసరాలను శుభ్రం చేయాలని నిర్దేశించింది. అయితే పుంగనూరు శుభారాం డిగ్రీ కళాశాలలో చీపుర్లకు బదులు కట్టె పుల్లలతో చెత్తను ఊడ్చి.. ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు బ్యానర్లు పట్టుకుని ఫొటోలకు పోజులివ్వడం విస్మయానికి గురిచేసింది. విద్యార్థులకు గురువులు నేర్పించే పద్ధతి ఇదేనా అంటూ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రభుత్వ కార్యక్రమంలో భాగస్వామ్యమవ్వడం ఇలానేనా అని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో అనర్థం



కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ప్రజాప్రతినిధులు

చిత్తూరు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం మెరుగైన పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యేక లక్ష్యంతో కార్యక్రమాలను చేపడుతోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. 'ఈ-చెక్' 'థీమ్‌తో నిర్వహించిన కార్యక్రమాన్ని చిత్తూరు నగరపాలక కార్యాలయంలో కలెక్టర్, ఎమ్మెల్యే జగన్ మోహన్, మేయర్ అముద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ నరసింహ ప్రసాద్ ప్రారంభించారు. చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన 'ఈ-చెక్' కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 5 వేల మెట్రిక్ టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాల ఉత్పత్తి అవుతుందని అంచనా ఉందన్నారు. వీటిని సరైన పద్ధతుల్లో రీసైక్లింగ్ చేయకపోవడం వల్ల ప్రమాదకర మూలకాలు భూమి, వాతావరణంలో కలుస్తున్నాయన్నారు. ఈ-వేస్ట్ (ఎలక్ట్రానిక్ పరికరాలు) నియంత్రించడంలో భాగంగా రానున్న నెల రోజుల పాటు క్షేత్ర స్థాయిలో చేపట్టనున్న ఈ-చెక్ కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. తమ గృహాలు, దుకాణాల్లోని వృథాగా ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల పరిధిలోని సచివాలయాల్లో అప్పగించాలని కోరారు. అనంతరం ప్రజా ప్రతినిధులు అధికారులు 'స్వచ్ఛ ప్రతిజ్ఞ' చేశారు. జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, ఎంహెచ్ఓ డా. లోకేష్, నగర పాలక అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సేంద్రియ వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు (ఇన్‌సెట్) సుదుమూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పండించిన ఆకు కూరలు

సర్కారు బడి.. సేంద్రియ ఒడి

ఆ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు.. మిగిలిన బడులకు ఆదర్శంగా నిలవాలనుకున్నారు.. ఇందుకు చదువుతో పాటు సమాజంలో జరిగే విషయాలపై విద్యార్థుల్లో చైతన్యం నింపారు.. క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపించాలని విద్యార్థులను వెన్నుతట్టి ప్రోత్సహించారు. ఇంకేముంది గురువుల ప్రోత్సాహంతో చెలరేగిపోయారు. బడిలోనే ప్రయోగపూర్వకంగా సేంద్రియ సాగు విధానంలో జీవామృతం తయారు చేసి ఆకుకూరలు పండించి ఔరా అనిపించారు సుదుమూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు. ఇదంతా ప్రాజెక్టు రూపంలో తీసుకొచ్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై సత్తా చాటారు.



చిన్నారుల చేతుల్లో పల్లెసీమల పౌష్టికాహారం ప్రాజెక్ట్

- సేంద్రియ సాగుతో ఆరోగ్యం, ఆదాయమని చాటిన విద్యార్థులు
- జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాజెక్టు ఎంపిక
- టి.సుదుమూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

చిత్తూరు కలెక్టరేట్ : కుప్పం మండలం సుదుమూరు జెడ్పీ హైస్కూల్లో 'సేంద్రియ వ్యవసాయానికి ప్రాణం పోస్తున్నారు. ఆ పాఠశాలలోని విద్యార్థులు 'పల్లె సీమల నుంచి పౌష్టికాహారం' సృష్టించగలమని నిరూపించారు. 'సేంద్రియ వ్యవసాయం' అనే అంశానికి రూపకల్పన చేసిన ఉపాధ్యాయుల ఆశలకు విద్యార్థులు తమ వంతు పాత్రను విజయవంతంగా పోషించారు. ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యవస్థాపక అభివృద్ధి కార్యక్రమంలో గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపియ్యారు.

నాలుగేళ్లుగా వ్యవస్థాపక కార్యక్రమం

రాష్ట్రంలో నాలుగేళ్లుగా వ్యవస్థాపకత మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి 2024–25 విద్యా సంవత్సరంలో కుప్పం మండలం టి.సుదుమూరు జెడ్పీ హైస్కూల్‌తో పాటు 39 జెడ్పీ, ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలలను ఎంపిక చేశారు. అయితే ఈ కార్యక్రమం అమలులో సుదుమూరు పాఠశాల రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటింది. 'సేంద్రియ వ్యవసాయానికి ఆ పాఠశాల హెచ్ఎం కొంత స్థలాన్ని కేటాయించారు. విద్యార్థులు ఆ భూమిని రెండు సార్లు చదును చేసి మడి మడిగా చేసి పాదులు చేశారు. ఘన జీవామృతంతో సారవంతం చేశారు. పాలకూర, మెంతికూర, కొత్తిమీర, బీన్స్ విత్తనాలను చదును చేసిన భూమిలో చల్లారు. జీవామృతం తయారు చేసి మొక్కలపై చల్లారు. ఫంగస్ వంటివి సోకకుండా పుల్లటి మజ్జిగను పిచికారీ చేశారు. ప్రస్తుతం ఆ విద్యార్థులు చేపట్టిన సేంద్రియ విధానంలో సాగు చేసిన ఆకు కూరలు కోతకు సిద్ధం అవుతున్నాయి.

రూపొందిన ప్రాజెక్టు ఇలా..

వ్యవసాయ రంగంలో అధిక ఉత్పత్తి కోసం రసాయనిక ఎరువులు, పురుగుమందులు అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో భూసారం తగ్గిపోతోంది. ఫలితంగా క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులతో పాటు అనారోగ్యపరమైన సమస్యలు పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సేంద్రియ సాగు ఉత్తమ పరిష్కారమని ఆ పాఠశాల విద్యార్థులు భావించారు. సేంద్రియ సాగుతో రసాయనాలు లేకుండా శుద్ధమైన, ఆరోగ్యకరమైన పోషకాహారం తయారు చేస్తున్నారు.

రసాయనాలు లేకుండా..

రసాయనాల ప్రభావం లేకపోతే మట్టిలో జీవ పదార్థాలను తద్వారా భూసారం నాణ్యతను పెంచుతుందని చెబుతున్నారు. నీరు, గాలి కాలుష్యాన్ని తగ్గించి, జీవ వైవిధ్యాన్ని, పర్యావరణ రక్షణ పెంపొందిస్తుందంటున్నారు. సేంద్రియ సాగు కోసం కంపోస్ట్, జీవామృతం, నీమాస్త్రం, మజ్జిగ పులుసు వంటివి వాడాలి. స్థానిక విత్తనాలను ఉపయోగించాలి. బహుళ పంటల సాగును ప్రోత్సహించాలి. సేంద్రియ వ్యవసాయం ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని, రైతుల ఆదాయాన్ని మెరుగు పరిచే గొప్ప మార్గమని విద్యార్థులు చాటి చెబుతున్నారు. ఇది దేశ వ్యవసాయ భవిష్యత్తుకు దారితీసే మార్గం అవుతుందని వెల్లడిస్తున్నారు. సేంద్రియ సాగుతో రసాయనాలకు అధిక ఖర్చు అవసరం ఉండదని, రైతులకు ఈ విధానం ఎంతో లాభదాయకమని ప్రాజెక్టు రూపంలో విద్యార్థులు సూచిస్తున్నారు.



రాష్ట్ర స్థాయికి ఎంపికై బహుమతి అందుకుంటున్న సుదుమూరు విద్యార్థులు (ఫైల్)

ఉత్తమ సామాజిక విజేతలు



ఉత్తమ విద్యార్థులను తయారు చేయడమే ఉపాధ్యాయుల బాధ్యత కాదని వారిని ఉత్తమ సామాజిక విజేతలుగా తీర్చిదిద్దాల్సి అవసరం ఉంది. రేపటి తరానికి ఉపయోగపడే స్థాయిలో ఆర్గానిక్ వ్యవసాయ విధానాల ప్రాముఖ్యం, ఉపయోగాలను ప్రాథమిక పాఠశాల నుంచే పాఠ్యాంశాలుగా చేర్చాల్సిన అవసరం ఉంది. సమాజంలో జరుగుతున్న, జరగాల్సిన మార్పులపై విద్యార్థులకు అవగాహన అవసరం. రసాయన వ్యవసాయం వల్ల సమాజానికి జరుగుతున్న ఆర్థిక, ఆరోగ్య నష్టాలను విద్యార్థులకు తెలియచేసి వారిని చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది. ఈ విధానాన్ని సుదుమూరు పాఠశాల విద్యార్థులు పక్కాగా అమలు చేయడం ఆనందంగా ఉంది.

– వెంకటరమణ, ఈఎండీపీ కో ఆర్డినేటర్, చిత్తూరు జిల్లా

25 నుంచి ఉరుసు ఉత్సవాలు



విద్యుత్ దీపాలంకరణలో నూర్‌షావలి దర్గా

పుంగనూరు : పట్టణంలోని చెరువు కట్టపై గల హజరత్ సయ్యద్ నూర్‌షావలిబాబా ఉరుసు ఈనెల 25న ప్రారంభించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు పోస్టర్లు , కరపత్రాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. 25న గంధం, 27న ఖవ్వాలి, 28న తహలీల్ ఫాతేహా నిర్వహిస్తారు. ఈ మేరకు దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎన్ఎస్.పేటలోని కళాశాల మైదానంలో ఉరుసు సందర్భంగా దుకాణాలు, రంగుల రాట్నాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉరుసు కార్యక్రమానికి వేల మంది ప్రజలు రానుండటంతో ఏర్పాట్లు చురుగ్గా చేపడుతున్నారు. ఈ మేరకు సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ లోకేష్ ట్రాఫిక్ ఏర్పాట్లు , పార్కింగ్‌పై కమిటీ సభ్యులతో చర్చలు జరుపుతున్నారు.

స్వచ్ఛ ప్రతిజ్ఞ

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయం, ఏఆర్ కార్యాలయం శనివారం 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, సిబ్బందితో ఏఆర్ డీఎస్పీ చిన్ని కృష్ణ స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాలను శుభ్రం చేయించి మొక్కలను నాటారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిత్యబాబు మున్సిపల్ పార్క్‌లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన



నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం):ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్(సీహెచ్‌ఓ) అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట శనివారం వారు శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలన్నారు. ఈపీఎఫ్‌ఓను పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని, నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌ఓలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ భద్రతతో పాటు హెచ్ ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అధ్యక్షులు కల్పన, ఉపాధ్యక్షులు భానుప్రియ, కార్యదర్శి కీర్తి ప్రియ, సభ్యులు దివ్య భారతి, అరుణకుమారి, కవిత, గంగమణి, మోహన కుమారి, సురేష్‌కుమారి, రషీద్, సుధీర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

21న పలమనేరులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

– హాజరుకానున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పలమనేరు : ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఈనెల 21న సోమవారం పట్టణ సమీపంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట దాకా జరిగే గ్రీవెన్స్‌డేకు కలెక్టర్ సుమిత్‌కుమార్ హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నట్లు ఆర్డీఓ భవానీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

పుంగనూరు : ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇరువురు గాయపడిన సంఘటన శనివారం భీమగానిపల్లె వద్ద జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపంజాణి మండలం కరసనపల్లెకు చెందిన రెడ్డెప్ప (25), వంశి(23) కలసి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఎదురుగా వచ్చి ఢీకొన్న వాహనదారులకు ఎలాంటి గాయాలు కాలేదు. మరో బైక్‌లో ఉన్న వారు గాయపడగా వారిని 108లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇండోర్ స్టేడియం కూల్చివేతపై విచారణ

పుంగనూరు : పట్టణంలోని ఎంబీటీ రోడ్డులో పట్టణ ప్రజల సహకారంతో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మద్దతు దారుడు కూల్చివేశాడు. దీనిపై శనివారం డీఆర్‌ఓ మోహన్‌కుమార్, తహశీల్దార్ రాముతో కలసి విచారణ చేపట్టారు. భవన నిర్మాణాన్ని , సంబంధిత రికార్డులను ఆయన పరిశీలించారు. దీనిపై స్టేడియం నిర్వాహకులు రాజారెడ్డి, డాక్టర్ శరణ్ తదితరులు కూల్చివేతపై డీఆర్‌ఓకు వివరించారు. విచారణ పూర్తి చేసి నివేదిక ప్రభుత్వానికి పంపుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ఫణికుమార్, వీఆర్వో భాస్కర్‌రెడ్డి, ఇండోర్ స్టేడియం నిర్వాహకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ అవినీతి సామ్రాజ్యం!

- కూటమి ప్రభుత్వం రాకతో చెలరేగిన వైనం
- చిన్నపనికైనా ప్రజలకు తప్పని వేధింపులు , వసూళ్లు
- హైకోర్టులో కేసులు, కలెక్టర్‌కు ఫిర్యాదులు
- చివరకు ఏసీబీకి పట్టుబడిన మండల మేజిస్ట్రేట్



సదుంలో ఏసీబీకి చిక్కిన తహసీల్దార్ హుస్సేన్

పుంగనూరు : రైతు నుంచి లంచం తీసుకుంటూ సదుం మండల ఇన్‌చార్జి తహసీల్దారు మారుఫ్ హుస్సేన్, వీఆర్‌ఓ మహబూబ్ బాషా శనివారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. సదుం తహసీల్దార్ బాగోతం అంతా ఇంత కాదు ఆ వివరాలు ఇలా.. ఆయన ఓ మండల మేజిస్ట్రేట్ .. సామాన్యులను కూడా వదలకుండా వేధించడం ఆయన నైజం.. చిన్న పనికైన రోజుల తరబడి కార్యాలయానికి తిప్పించుకోవడం , లొంగకపోతే తన తహసీల్దార్ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ తన హోదాతో ఆదేశాలు ఒక్కొక్కశాఖకు ఇవ్వడం ఆ శాఖ ద్వారా రైతులు , ప్రజలను వేధించడం ఆయనకు నిత్యకృత్యంగా మారింది. దీనికి బెంబేలెత్తిపోయిన ప్రజలు నేరుగా కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఆయన అక్రమాలపై రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. అంత జరిగినా తహసీల్దారు మారుఫ్ హుస్సేన్ బుద్ధి మాత్రం మారలేదు. కార్యాలయానికి వచ్చే వారిని పిలిపించుకుని రూ. లక్షల రూపాయలు వసూలు చేసుకుంటూ అవినీతికి కేరాఫ్‌గా సదుం మండలంలో నిలిచిపోయారు.

కూటమి నేతలతో చెలరేగాడు

సదుం తహసీల్దార్‌గా కూటమి ప్రభుత్వంలో బదిలీపై హుస్సేన్ పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఆరు నెలల కాలంలో ఆయన చేసిన అవినీతి అక్రమాలు అంతులేకుండా పోయింది. కూటమి నేతల అండతో ఇష్టారాజ్యంగా చెలరేగిపోయాడు.

బాధితులు ఎందరో..

సదుం మండల తహసీల్దార్ హుస్సేన్ అధికార దుర్వినియోగానికి పాల్పడటంతో పలువురు ఆయన బాధితులు మండలంలో ఉన్నారు. దిగువకురప్పల్లెకి చెందిన మల్లయ్య అనే వ్యక్తికి తిమ్మానాయునిపల్లె గ్రామ దాఖల సర్వే నంబరులో 13.1లో 3.58 ఎకరాల పొలం ఉంది. ఇందులో ప్రభుత్వం పొలాన్ని ప్రాజెక్టుకు తీసుకుంది. మిగులు భూమితో పాటు బోరు బావితో మల్లయ్య పంటలు సాగు చేసుకుంటున్నాడు. తహసీల్దార్ డిమాండ్లకు తలవంచకపోవడంతో అతనిని వేధింపులకు గురి చేశాడు. ఆయన రెండు సార్లు హైకోర్టులో కేసు వేసి తహసీల్దార్ ఉత్తర్వులను రద్దు చేయించుకున్నాడు. అలాగే గొంగివారిపల్లెకి చెందిన ప్రసాద్, సుగుణ, చిన్నక్క, రమణ, రాజమ్మలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎర్రాతివారిపల్లెకి చెందిన ఎస్.సురేంద్ర తహసీల్దార్ అక్రమాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

తహసీల్దారు ఇంట్లో ఏసీబీ తనిఖీలు

చిత్తూరు అర్బన్ : సదుం మండల ఇన్‌చార్జి తహసీల్దారు హుస్సేన్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు పట్టుబడటంతో.. చిత్తూరులోని ఆయన ఇంట్లో సోదాలు చేపట్టారు. శనివారం సాయంత్రం తిరుపతి నుంచి వచ్చిన ఏసీబీ ప్రత్యేక బృందం చిత్తూరు నగరంలోని రామ్‌నగర్ కాలనీలో ఉన్న హుస్సేన్ ఇంట్లో దాదాపు రెండు గంటల పాటు తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో పలు పత్రాలు, కీలక ఆధారాలు లభ్యమైనట్లు సమాచారం.

మా ఉసురు కొట్టుకుంది...



నేను టమాట పండించా. నన్ను రకరకాలుగా వేధిస్తూ తహసీల్దార్ ఉత్తర్వులు ఇచ్చారు. వాటిపై నేను హైకోర్టులో రెండు రిట్ పిటిషన్లు దాఖలు చేసి, తహసీల్దార్ ఉత్తర్వులు రద్దు చేయించుకున్నా. నేను లొంగకపోవడంతో కక్ష కట్టి రోజుకొక ఆర్డర్ ఇచ్చి వేధించాడు. బోరుకు విద్యుత్ కనెక్షన్ తొలగించాలని ఆర్డర్ ఇచ్చాడు. అప్పటికీ లొంగకపోవడంతో భూమి, బోరును ప్రజా అవసరాలకు స్వాధీనం చేసుకుంటామంటూ ఆర్డర్ ఇచ్చాడు. ఈలోపు మా ఉసురు కొట్టుకుని తహసీల్దార్ జైలుకు వెళ్లాడు. మాకెంతో సంతోషంగా ఉంది. – మల్లయ్య, దిగువకురప్పల్లె, రైతు, సదుం మండలం

పుత్తూరులో పట్టపగలు దోపిడీ

- మార్వాడీ షాపులో రూ.6.30 లక్షలు దోచుకొన్న దొంగలు
- షాపు యజమానిని కత్తులతో గాయపరిచి దోపిడీకి పాల్పడిన వైనం
- మోటార్ సైకిల్‌పై పరారైన ముగ్గురు ఆగంతకులు
- ముగ్గురూ 25 ఏళ్ల లోపు యువకులే



దోపిడికి గురైన మీనాక్షీ ఏజెన్సీ దుకాణం

పుత్తూరు : ఓ మార్వాడీ షాపులోకి ముగ్గురు ఆగంతకులు చొరబడి షాపు యజమానిని గాయపరిచి రూ.6.30 లక్షలు దోచుకెళ్లిన ఘటన పుత్తూరు పట్టణంలో శనివారం ఉదయం చోటు చేసుకొంది. సీఐ సురేంద్రనాయుడు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పుత్తూరు పట్టణంలో నివాసం ఉండే రంజిత్‌జీ అనే మార్వాడీ స్థానిక నగరి రోడ్డులో కొంత కాలంగా మీనాక్షి ఏజెన్సీని నడుపుతున్నాడు. శనివారం ఉదయం 7 గంటలకు రంజిత్‌జీ కుమారుడు మహేంద్రకుమార్ (28) షాపును తెరిచాడు. ముందుగా వచ్చిన ఒక కస్టమర్‌కు రూ.2 లక్షలకు పాన్ మసాలా సరుకును విక్రయించాడు. అనంతరం పిచ్చాటూరు నుంచి వచ్చిన మరో కస్టమర్ ఠాగూర్(24) అతని డ్రైవర్ ఏలుమలైలు రూ.4.30 లక్షలు చెల్లించి పాన్ మసాలా సరుకును వ్యాన్‌లోకి లోడ్ చేశారు. అదే సమయానికి షాపు ముందు బుల్లెట్ మోటార్ సైకిల్‌పై 25 ఏళ్ల వయస్సున్న ముగ్గురు యువకులు వచ్చి ఆగారు. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి బైక్ పైనే ఉండగా ఇద్దరు దిగి వచ్చి మహేంద్ర కుమార్‌ను గల్లాలోని డబ్బు ఇవ్వాలంటూ కత్తులు చూపి బెదిరించారు. గల్లాలో ఏమీ లేదంటూ చెప్పడంతో మహేంద్ర కుమార్‌ను భుజంపై కత్తితో దాడి చేశారు. అడ్డువచ్చిన షాపు అసిస్టెంట్ సునీల్‌ను మరో యువకుడు కత్తితో కాలిపై గాయపరిచాడు. వెంటనే గల్లాలోని డబ్బు బ్యాగ్‌ను తీసుకోవడంతో పాటు మహేంద్రకుమార్, సునీల్ వద్ద నుంచి సెల్ ఫోన్లను లాక్కొని మోటార్‌సైకిల్‌పై ముగ్గురూ పరారయ్యారు. వెంటబడిన మహేంద్రకుమార్ షాపు సమీపంలోని ఆర్డీఎం గేట్ వద్ద డ్యూటీలో ఉన్న పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే సీఐ సురేంద్రనాయుడు అప్రమత్తం అయ్యి మహేంద్రకుమార్, సునీల్ ఫోన్ నంబర్లను టీస్‌పుట్ చేయగా అవి స్థానిక చర్చి కాంపౌండ్ వద్ద లొకేషన్‌ను చూపాయి. అక్కడికి చేరుకొన్న సీఐకి రెండు సెల్ ఫోన్లు అక్కడ లభ్యమయ్యాయి. దుండగులు ఫోన్లను అక్కడ పడేసి పరారైనట్లు గుర్తించి వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కస్టమర్ ఠాగూర్‌తో పాటు అనుమానాస్పద వ్యక్తులను గుర్తించిన పోలీసులు వారి కాల్ డేటాలను పరిశీలిస్తున్నారు. కేసు దర్యాప్తు పురోగతిలో ఉందని త్వరలోనే కేసును ఛేదిస్తామని సీఐ సురేంద్రనాయుడు వెల్లడించారు.

ఏఎన్‌ఎంలకు ఆర్డర్లు అందజేత

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం గ్రేడ్-3 ఏఎన్‌ఎంల ఉద్యోగోన్నతులకు సంబంధించిన ఆర్డర్లను అందజేశారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఈ ఆర్డర్లను అందజేశారు. ఉద్యోగోన్నతులకు 298 మంది అర్హులుగా ఉన్నారని ఆమె వెల్లడించారు. ఇందుకు ఒక్కో ఏఎన్‌ఎం నుంచి రూ. 5 వేలు వసూలు చేస్తున్నారని పుకార్లు వచ్చాయి. ఈ పుకార్లు నమ్మొద్దంటూ ఓ యూనియన్ నాయకుడు వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన గ్రూపుల్లో వాయిస్ రికార్డ్ పెట్టారు. ఎవరిని డబ్బులు అడగలేదంటూ స్పష్టం చేశారు.

మోసగాళ్లు అరెస్టు

- లక్ష్మీపూజ కేసులో పట్టుబడిన మిగిలిన నిందితులు
- ఇప్పటికే ముగ్గురు నిందితులు రిమాండ్‌లో...
- రూ.1.65 లక్షల నగదు, మూడు ఫోన్లు, బైక్ స్వాధీనం

నింద్ర : మోసమే వృత్తిగా మలచుకొని పబ్బం గడుపుతున్న బడా మోసగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. కొంత డబ్బులు చెల్లిస్తే లక్ష్మీపూజ చేసి దాన్ని మూడింతల సొమ్ముగా మార్చి అకౌంట్లో వేస్తామని మాయ మాటలు చెప్పి మహిళను ఏమార్చిన కేసులో వీరు పట్టుబడ్డారు. డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్ తెలిపిన వివరాల మేరకు విద్యుత్‌శాఖలో జూనియర్ ఇంజినీర్‌గా పని చేస్తున్న ఆశాజ్యోతిని డబ్బులు (లక్ష్మీ పూజ చేయడం వల్ల వచ్చే డబ్బులు) పేరిట బురిడీ కొట్టించి రూ. లక్ష ఇస్తే రూ.3 లక్షలుగా తిరిగి అకౌంట్లో వేస్తామని నమ్మించారు. ఈనెల 10వ తేదీన మండలంలోని అయ్యార్ కండ్రిగకు వెళ్లే రోడ్డులో ఓ ప్రైవేటు కంపెనీ సమీపంలో ఆశాజ్యోతి, ఆమెతో పాటు వచ్చిన వారి వద్ద నుంచి రూ.7.30 లక్షలు కొట్టేశారు. మోసపోయామని గుర్తించిన ఆశాజ్యోతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్పీ మణికంఠ ఆదేశాలతో విచారణ చేపట్టారు. ఈ మేరకు ఈనెల 11వ తేదీన పిచ్చాటూరు దళితవాడకు చెందిన జాన్ సుగంధర్ అలియాస్ అప్పు(34), నీరువాయి హరిజనవాడకు చెందిన ఆరుముగం ప్రకాష్(39), కావనూరు హరిజనవాడకు చెందిన ఎం.వేలాయుధం(37)లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3 లక్షల నగదు, సుజుకి కారు, హీరో స్పెండర్ ప్లస్ మోటార్ సైకిల్, పోలీసు యూనిఫామ్ దుస్తులు, మొబైల్ ఫోను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపించారు. కాగా ఈ కేసులో పరారైన మిగిలిన నిందితులను ప్రొద్దుటూరుకు చెందిన గూడు ముచ్చర్ల రాజరత్నం(53), అనంతపురం జిల్లా యాడికి టౌన్‌కు చెందిన బిసిగానిపల్లి చెన్నకేశవ(30) , కొప్పేడు హరిజనవాడకు చెందిన దేవేంద్రన్ అలియాస్ నరేష్(37), గుండ్రాజ్ కుప్పం దళితవాడకు చెందిన వి.ఎం కార్తికేయన్ (40), ఆలపాకం దళితవాడకు చెందిన డి. రూబన్ (36) లను శనివారం మండలంలోని నెట్టేరి బస్టాండులో సీఐ భాస్కర్ అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.1.65 లక్షల నగదు, మూడు మొబైల్ ఫోన్లు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు దర్యాప్తులో చురుగ్గా వ్యవహరించిన పోలీసులు గోవిందరాజులు, సుబ్రహ్మణ్యం, చిరంజీవి, రమేష్, మణవాళన్, అయ్యప్ప, అమరేష్, సోముసుందరం, రామచంద్ర, వేలాయుధం, లక్ష్మయ్యలను డీఎస్పీ ప్రశంసించారు.

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి

పూతలపట్టు (కాణిపాకం) : రైలు నుంచి జారి పడి ఓ యువకుడు శనివారం మృతి చెందాడు. వివరాలు ఇలా ..గంగాధర నెల్లూరు మండలానికి చెందిన ప్రవీణ్(21) అనే యువకుడు తిరుపతి నుంచి చిత్తూరు వస్తున్నారు. ఈ క్రమంలో పూతలపట్టు మండలం మృత్తిరేవుల గ్రామం వద్ద రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

దూదేకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గఫూర్



డీజీ గఫూర్

వెదురుకుప్పం : రాష్ట్ర నూర్ బాషా (దూదేకుల) ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలోని నల్ల వెంగనపల్లె పంచాయతీ ఏపేరి గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ డైరెక్టర్ డీజీ గఫూర్‌ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం నేతలు ప్రకటించారు. శుక్రవారం విజయవాడలో జరిగిన మైనారిటీ సమావేశంలో రాష్ట్ర దూదేకుల సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్‌సయ్యద్ బాజీ నేతృత్వంలో ఎన్నుకున్నట్లు తెలిపారు.

పల్లెల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలి



పాలేరులో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

బంగారుపాళెం : గ్రామాల పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములైనప్పుడే స్వచ్ఛాంధ్రప్రదేశ్ వైపు అడుగులు సాధ్యమని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం బంగారుపాళెం మేజరు పంచాయతీలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. తొలుత పాలేరు సమీపంలోని డంపింగ్ యార్డును సందర్శించి మొక్కను నాటి నీరు పోశారు. గ్రీన్ అంబాసిడర్లతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రీన్ అంబాసిడర్లకు పంచాయతీ కార్యదర్శులతో చర్చించి బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డీపీఓను ఆదేశించారు. నెలకు ఒక్కసారి తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి ప్రజలకు శుద్ధ జలం అందించాలని ఆదేశించారు. కలుషిత నీరు తాగి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత పడాలని హెచ్చరించారు. హైప్లజర్ క్లీనింగ్ మిషన్ ద్వారా ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేసే విధానం గురించి డీపీఆర్‌సీ కో ఆర్డినేటర్ షణ్ముగం కలెక్టర్‌కు వివరించారు. వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద నూతనంగా నిర్మించిన నీటి తొట్టెలను, ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం బంగారుపాళెంలోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. సిబ్బంది సమయ పాలన పాటించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీషను ఆదేశించారు. చివరగా స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, తహశీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్, స్థానిక సర్పంచ్ ఉమాదేవి, ఉప సర్పంచ్ కామరాజు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.